కర్నూలు | నంద్యాల
వార్త
4 డిసెంబరు, 2022 ఆదివారం పేజీలు 4

# తుంగభద్ర నదిలో యువకుడు గల్లంతు

-పుట్టీ సాయంతో
పోలీసుల గాలింపు
-కేసు నమోదు
చేసిన పోలీసులు



**చెట్నహళ్ళి(మంత్రాలయం), డిసెంబర్ 3, ప్రభాతవార్త:** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయం పోలిస్ స్టేషన్ పరిధిలోని చెట్నహళ్ళి గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో ఓ యువకుడు గల్లంతైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు ఒంగోలు జిల్లా, చేజెర్ల గ్రామానికి చెందిన భవన నారాయణ, భవానిల కుమారుడు పసుపులేటి గోపి(230) అనే యువకుడు చెట్నహళ్ళి గ్రామంలో జరుగుతున్న తిక్కతాత స్వామి ఉరుసు నిమిత్తం వారి బంధువుల ఇంటికి వచ్చాడు. అయితే స్నేహితులతో కలిసి తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్ళారు. అయితే నదిలో స్నానానికి వెళ్ళిన సమయంలో లోతు ఎక్కువగా ఉండడంతో ఈ యువకుడు గల్లంతైనట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మిగనూరుఫైర్ సిబ్బంది పుట్టీ సాయంతో నదిలో వెతికారు. అయినప్పటికీ యువకుడు అచూకీ తెలియలేదు. చేతికి వచ్చిన కుమారుడు నదిలో గల్లంతు కావడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మంత్రాలయం



# అక్రమణకు గురైన గంజహళ్ళి చెరువు

- అక్రమంగా చెరువులో బోరు, విద్యుత్ మోటర్ల ఏర్పాటు - ఫిర్యాదు చేసిన పట్టించుకోని రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు - గ్రామస్థులు గోడు



**గోనెగండ్ల డిశంబరు 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గంజహళ్ళి గ్రామ చెరువును పలు రాజకీయ పార్టీల నాయకులు అక్రమించుకోని యదేచ్ఛగా పంటలు సాగు చేసుకుంటున్నారు. చెరువులో బోర్లు, విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసుకొని అక్రమంగా పంటలను పండిస్తున్నారు. వివరాలు గంజహళ్ళి గ్రామంలో 366/1బీ, 366/2, 367/1, 368/1, 368/2, 369/1, 369/2 అనే సర్వే నెంబర్లలో దాదాపు 82 ఎకరాల చెరువు ఉంది. వర్షా కాలంలో ఈ చెరువుకు నీరు చేరితే ఈ చెరువు కింద దాదాపు 200 ఎకారాల చెరువు ఆయకట్టు భూమిలో పంటలు సాగు చేసుకునే వారు. అయితే గత కొన్నేళ్లుగా వర్షాలు సకాలంలో కురియక పోవడంతో చెరువులో నీరు చేరలేదు. దీన్ని అసరగా చేసుకొని గ్రామానికి చెందిన కొందరు రాజకీయ పార్టీ నాయకులు ఎకంగా చెరువులో దాదాపు 45 నుంచి 50 ఎకరాల వరకు అక్రమించి అందులో బోర్లు వేసి అక్రమంగా విద్యుత్ కనెక్షన్ కుడా ఏర్పాటు చేసుకొని వేరుశనగ, పత్తి, మొక్కజోన్న, శనగ, పంటలు పండించుకుంటున్నారు. దీంతో చెరువులో నీరు లేక పోవడంతో కింద ఉన్న రెండు వందల ఎకరాల బిడు భూమీగా మరిపోయింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కొందరు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారుల దృష్టి తీసుకువెళ్లారు. అయినప్పటికి పలితం కనిపించలేదు. అక్రమణ దారుల నుంచి చెరువును కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**-చెరువును కాపాడండిః- లింగమ్మ సర్పంచ్ గంజహళ్ళి**
గంజహళ్ళి చెరువు అక్రమణకు గురియింది వాస్తవమే అక్కడ చెరువును అక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నారు. బోర్లు కూడా వేశారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌లు కూడా ఇచ్చారు. ప్రభుత్వ అధికారులు స్పందించి అక్రమణ దారుల నుంచి చెరువును కాపాడాలి.

**-అధికారులకు ఫిర్యాదు చేశానుః-తోలు రాముడు. గంజహళ్ళి**
చెరువు అక్రమణకు గురయినట్లు తెలుసుకొని గత ఏడాది నుంచి పలు మార్లు రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాను. అయినప్పటికి అధికారులు స్పందించ లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి అక్రమణ దారుల నుంచి చెరువును కాపాడాలి.

# రాయలసీమ వెనుకబాటు తనాన్ని దేశమంతా చాటుదాం



## - రాష్ట్ర మంత్రి బుగ్గన

**కర్నూలు, డిసెంబరు 3, ప్రభాతవార్త బ్యూరో :** గత దశాబ్దాలుగా రాయలసీమ వెనుకబాటు తనాన్ని సీమ హక్కులను దేశమంతా చాటుదామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. శనివారం స్థానిక గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. మద్రాస్ పాలన నుండి విడిపోయాక అప్పట్లో కర్నూలు రాజధానిగా చేశారన్నారు. ఆ తదనంతరం నైజాం పాలనలో ఏపి, కర్ణాటక, మహారాష్ట్రాల పరిధిలో ఉన్న తెలుగు వారందరిని ఒకటే రాష్ట్రంగా ఉండేలా అప్పటి పెద్దల అంగీకారంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడగా ఇప్పుడు అది రెండు రాష్ట్రాలుగా చూస్తున్నామన్నారు. దక్షిణ భారతదేశంకు రాయలసీమ మద్యభాగంలో ఉండడంతో ఇక్కడ ఈశాన్య, నైరుతి రుతుపవనాలు గ్యారెంటీగా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. దీంతో రాయలసీమ అనాదిగా అన్నివిధాలుగా నష్టపోతుందని కాబట్టి ఇక్కడ న్యాయరాజధానిని ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేయగలమని ఆలోచించి మూడు రాజధానుల బిల్లును తేవడం జరిగిందన్నారు. అమరావతి రాజధానికి అనుకూలం కాదని శివరామకృష్ణన్ కమిటీ తెలిపినప్పటికీ అప్పటి సిఎం చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. మూడేసి పంటలు పండే పచ్చని పొలాలను కేవలం ఒక ప్రాంత అభివృద్ధి కోసం నాశనం చేశారని బుగ్గన విమర్శించారు. ఈ నెల 5న జిల్లా కేంద్రం కర్నూలులో జరిగే రాయలసీమ గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. జెఏసి ఆద్వర్యంలో జరుగుతున్న ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. అలాగే ఈ జేఏసిలో విద్యార్థి, ఉద్యోగ సంఘాలు, ఎన్‌జిఓలు, ప్రజాసంఘాలు, న్యాయవాదులు ఇలా అందరు పాల్గొని మన హక్కులకై నినదించాలన్నారు. రాష్ట్ర అభివృద్దిపై బాబు చేస్తున్న ఆరోపణలు అన్నీ అవాస్థవమని ప్రతి అభివృద్దికి ఫిగర్స్‌తో సహా రికార్డ్ ఉందన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ బివై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, రాం భూపాల్‌రెడ్డి, బుట్టారేణుక తదితరులు పాల్గొన్నారు.

# కోట్లను విమర్శించే స్థాయి నీ.. కెక్కడిది ?

- జిల్లాలో ఎవరి హయంలో అభివృద్ధి జరిగిందో .. తేల్చుకునేందుకు డిబెట్‌కు రెడీ...
- రాష్ట్ర టీడీపీ మహిళా అధికార ప్రతినిధి సి.బి లత
- సీనియర్ టీడీపీ నేత కె.హేమాద్రిరెడ్డిల సవాలు

2లో



**కోడుమూరు, డిసెంబర్ 3 , ప్రభాతవార్త :** సుస్థిర రాజకీయ చరిత్ర కల్గిన కోట్ల కుటుంబాన్ని విమర్శించే స్థాయి నీ .. కెక్కడిదని రాష్ట్ర టీడీపీ మహిళా అధికార ప్రతినిధి సి.బి లత ప్రశ్నించారు. శనివారం స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో స్థానిక టీడీపీ శ్రేణులు సి.బి లత, కె.హేమాద్రిరెడ్డిలు వైసీపీ జిల్లా అధ్యక్షుడు బివై రామయ్య చేసిన అసత్యపు ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ఖండించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాతో పాటు కోడుమూరు నియోజకవర్గంలో ఎద్దైన అభివృద్ధి జరిగిందంటే దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి చలువ వల్లే జరిగిందన్నారు. ఆ తరువాత కూడా మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి రాజకీయ అరంగ్రేటం చేసిన తరువాత కూడా చేపట్టిన పదవులతో ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. జిల్లాలో ఎవరి హయంలో అభివృద్ధి జరిగిందో తేల్చుకోవడానికి డిబెట్‌కు రండి అని సవాలు చేశారు. కోట్ల సూర్య దయతో రాజకీయ ప్రవేశం చేసిన బివై రామయ్య నేడు కోట్లనే విమర్శించే స్థాయికి ఎదగడం చూస్తుంటే తల్లీ పాలు తాగి తల్లి రొమ్మును తన్నిన విధంగా ఉందన్నారు. కోట్ల వెంటే తిరగిన రామయ్యకు జిల్లాలో జరిగిన అభివృద్ధి గురించి తెలియక పోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. కేంద్ర రైల్వే మంత్రిగా కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఉన్న హయంలో జిల్లాలో ని ఆయా రైల్వే స్టేషన్లలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కర్నూలు రైల్వే స్టేషన్‌లో ఈ రోజు జరిగిన అభివృద్ధి ఎవరి వల్ల జరిగిందో జిల్లా ప్రజలకు తెలుసునన్నారు. కర్నూలు, వెల్దుర్తి, తుగ్గలి మండలాల్లో రైల్వే స్టేషన్ల దగ్గర అండర్ బ్రిడ్జి నిర్మాణాలు జరిగిన విషయం నీకు తెలుయదా అని బివై రామయ్యపై మండిపడ్డారు. కర్నూలులో హ్యాపిటేషన్ ఫ్యాక్టరేని మంజూరు చేస్తే ప్రస్తుతం ఉన్న బిజెపి పార్టీ ఆ ఫ్యాక్టరేపై రాజకీయం చేయడం వల్ల ఈ ప్రాంతంలో ఎంతో మందికి ఉపాధి కోల్పోయిన విషయం వారు ఈ సందర్బంగా గుర్తు చేశారు. గత మూడున్నర ఏళ్ల వైకాపా పాలనలో చేసిన అభివృద్ధి ఎదో చూపండని ప్రశ్నించారు.

# వైసిపి ప్రభుత్వంలో ప్రజల చెంతకే పాలన

- గ్రామాల ప్రశాంతతకు కృషి
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

**దేవనకొండ, డిసెంబరు 3, ప్రభాతవార్త :** వైసిపి ప్రభుత్వంలో ప్రజల చెంతకే పాలన అందిస్తున్న ఘనత రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర ఉపాధి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో తన సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామిలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రజలతో మమేకమై ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గ్రామంలో గీరప్ప కాలనీలో డ్రైనేజీలు, సిసి రోడ్లు నిర్మించాలని ఆ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు సచివాలయానికి మంజూరయ్యే నిధులు వెచ్చించి పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి ఆలూరు నియోజకవర్గంలో ఎలాంటి ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించలేదని,



2లో

# ప్రజలకు బాధ్యతగా అధికారులు పనిచేయాలి

- పత్తిపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని గుర్తించండి
- ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు కార్గోనిళ్ల పంపిణీ
- గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ సర్వేక్షణ రిక్షాల పంపిణీ



**కర్నూలు, డిసెంబర్3, ప్రభాతవార్త:** ఎంపిపి బోయ శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామ సచివాలయాలకు వివిధ పనుల పై వచ్చే ప్రజలు బాధ్యతయుతంగా అధికారులు పనిచేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపిపి బోయ శారద అధ్యక్షతన కల్లూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మార్కెట్‌యార్డు ఛైర్మన్ మిదివేముల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ అల ప్రభాకర్‌రెడ్డిలు హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు వారి వారి శాఖల నివేదికలను చదివి వినిపించారు. పెద్ద టేకూరు ఎంపిటిసి సభ్యులు కె.మునిస్వామి తమ గ్రామం నుంచి దూపాడు గ్రామం వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. మల్కాపురం సర్పంచ్ బి.మద్దిలేటి గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు త్వరగా బిల్లులు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పర్లా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులలో అవినీతికి తావులేకుండా పూర్తి చేయాలని ఎంపిటిసి సభ్యులు అశోక్‌రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మిపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని 789 సర్వే నంబర్‌లో గల భూమి కబ్జాతో తనకు ఎలాంటి సంబంధంలేదని స్పష్టం చేశారు. ప్లాట్ యజమానుల వైపు న్యాయముంటే వారి వైపే రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వాలని చెప్పారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద వచ్చిన కార్గోనిళ్లను ఫీల్డ్ అసిస్టెంట్లకు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు స్వచ్ఛ సర్వేక్షణ రిక్షాలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపిపి బోయ శారద, ఎంపిడివో జి.వి.రమణమూర్తి, తహసీల్దార్ రమేష్‌బాబు, ఈవోఆర్డీ రవి, కిశోర్, ఏపీవో మద్దేశ్వరమ్మలు పంపిణీ చేశారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సైకో పాలన వద్దు.. సైకిల్‌పాలన ముద్దు



**నంద్యాల, డిసెంబరు 3, ప్రభాతవార్తః** మూడున్నర సంవత్సరాలుగా జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో నిలువునా ముంచారని అవినీతి దాహానికి అంతేలేకుండా పోయిందని మాజీ మంత్రి, ఎమెల్సీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రెండవ వార్డులో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు ప్రజలకు టిడిపి నేతలు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో సైకోపాలన వద్దని సైకిల్‌పాలనే ముద్దని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు కూడ ఇవ్వలేని స్థితిలో ఈప్రభుత్వం ఉందని మునిస్పాలిటిలో అవినీతి కంపుకొడుతున్నా నంద్యాల ఎమ్మెల్యేకు పట్టదని అరోపించారు. జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో నిలువునా ముంచేశారని, అవినీతి దాహానికి రాష్ట్రానికి కొత్తపరిశ్రమలు రాక ఉన్న పరిశ్రమలు కూడ తరలిపోతున్నాయని ఫలితంగా యువతకు ఉద్యోగాలు లేక పక్కా రాష్ట్రాలకు వలసపోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఇదేం ఖర్మ అని యువత అలోచించాలన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రం ద్వారా ప్రజల నుంచి లిఖీతపూర్వకంగా తీసుకున్న తరువాత వారి మొబైల్ నంబరు నుంచి కలిసి పోరాడేందుకు 9261292612 నంబరుకు మిస్డ్‌కాల్ తీసుకుంటునాన్నమన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలిపించుకునేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని కార్యకర్తలంతా కష్టపడి ప్రతినియోజకవర్గంలోను టిడిపిని గెలిపించుకొని ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబును చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ సెగ్మెంట్ పోల్ కో-అర్డినేటర్ కుందూరు శివరామిరెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇదేం ఖర్మ కార్యక్రమంలో వార్డులో పర్యటిస్తున్న భూమా, ఫరూక్

# జై రాయలసీమ, జైజై రాయలసీమ

- ఒకరాజధాని వద్దు, మూడు రాజధానులు ముద్దు
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

**కర్నూలు మున్సిపల్, డిసెంబరు 3, ప్రభాతవార్తః** వికేంద్రీకరణకు మద్దతుగా కర్నూలు న్యాయరాజధాని కోసం కర్నూలు ఎస్టీబిసి కళాశాల మైదానంలో 5వ తేదిన సీమ గర్జన జేఏసి అధ్వర్యంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ రాయల ఫంక్షన్‌హాల్‌లో సమావేశమై సీమ గర్జన పోస్టర్‌ను అవిష్కరించారు. శనివారం కర్నూలు నగరంలో రాయలఫంక్షన్‌హాల్‌లో జేఏసి అధ్వర్యంలో సమావేశమై 5వ తేదిన ఎస్టీబిసి మైదానంలో జరగబోయే సీమ గర్జన కార్యక్రమానికి తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు జేఏసి పిలుపుమేరకు ఇక్కడకు విచ్చేసి షరాఫ్ బజార్ అసోసియేషన్, ఇండస్ట్రీ అసోసియేషన్ నుంచి బజార్ అసోసియేషన్ కిరాణం, హోల్‌సెల్ అసోసియేషన్, జిమ్ అసోసియేషన్ ప్రతిఒక్కరు స్పందించి కర్నూలు నగరంలో 5న జరిగే రాయలసీమ గర్జన కార్యక్రమానికి మేమందరం కలిసికట్టుగా ముందుకు వస్తామని రాయలసీమ కొరకు న్యాయరాజధాని సాధించేందుకు మేమందరం మద్దతు ఇస్తామని సోమవారం మన వ్యాపార షాపులను బందేసి రాయలసీమ గర్జన కార్యక్రమం విజయవంతం చేస్తామని మనస్పూర్తిగా చెప్పడం జరిగిందని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు.



# శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో కన్నడ హీరో శివరాజ్‌కుమార్

పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న శివరాజ్‌కుమార్

**మంత్రాలయం, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కన్నడ హీరో శివరాజ్‌కుమార్ దంపతులుశనివారం మంత్రాలయం విచ్చేశారు. వీరికి శ్రీమఠం అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవతమంచాలమ్మను దర్శించుకొని మంగళ హారతులిచ్చారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీమఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు శ్రీ రాఘవేంద్రస్వామి మొమెంటో, పటు వస్త్రాలు, పరిమళ ప్రసాదం, ఫల, పుష్ప, మంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు. వీరివెంట రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండిత కేసరి రాజా ఎస్ గిరియాచార్, ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, పిఆర్ఓ వ్యాసరాజాచారి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు ఉన్నారు.



# సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికి అందుతున్నాయి : ఎమ్మెల్యే

**మహానంది, డిసెంబరు 3, ప్రభాతవార్తః** సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికి అందుతున్నాయని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శనివారం మహానంది మండలం బసవాపురం గ్రామంలోని వైయస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షపథకం మీభూమి మా హామి అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ సుమారు రూ.1000 కోట్ల వ్యయంతో సమగ్రభూ సర్వే అనే కార్యక్రమాన్ని రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈసర్వే వల్ల భూములకు సంబంధించిన ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా సమగ్ర రీసర్వేచేసి సాగులో ఉన్న రైతులకు నిక్కచ్చిగా కొలతలతో పట్టాదారు పాసుబుక్కు అందించడం జరుగుతుందన్నారు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న ముఖ్యమంత్రికి మనవంతుగా సహాయ సహకారాలు అందించాలని ప్రజలు కోరారు. సంక్షేమ పథకాలు రాష్ట్రంలో



పాదయాత్రలో భాగంగా ఇచ్చిన హామిలను 98శాతం నేరవేర్చిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే మనరాష్ట్ర ప్రభుత్వమే అని కొనియాడారు. ఈకార్యక్రమంలో శ్రీశైల నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, జడ్పీటిసి మహేశ్వర్‌రెడ్డి, గోపవరం పుల్లయ్య యాదవ్, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వంలో
# ప్రజల చెంతకే పాలన

**(మొదటి పేజీ తరువాయి)** గ్రామాల ప్రశాంతతకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సిఎం జగన్ నెరవేర్చారని తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వార ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీతకు అతీతంగా అర్హులందరికి అందిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ నెల 7వ తేదీన విజయవాడ పట్టణంలో జరిగే వైసిపి జయహో బిసి అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కిట్టు,కప్పట్రాళ్ల మల్లికార్జున,ఎంపిపి భర్త లుముంబా,ఎంపిటిసి రూపమ్మ,ఎంపిడిఓ గౌరీదేవి,తహశీల్దార్ సుదర్శనం,ఏపిఓ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మురళీమోహన్,మండల వైసిపి నాయకులు దివాకర్‌నాయుడు, ప్రేమ్‌నాథ్‌రెడ్డి,మోహన్‌రెడ్డి,నిజాల్‌రెడ్డి,మదన్ మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి,రాజన్న,ప్రభాకర్‌నాయుడు, మధుసుదన్ నాయుడు,చంద్రన్న, నరసింహయ్యస్వామి,గుండు రంగస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

## జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాల వారికి సంక్షేమపథకాలు - ఎంపిపి బొమ్మన సరళారవిరెడ్డి

**వెల్దుర్తి,డిసెంబర్3,ప్రభాతవార్త :** జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపిపి బొమ్మన సరళారవిరెడ్డి అన్నారు.స్థానిక ఎంపిడిఓ కార్యాలయం సమావేశ భవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.3 నెలలకు ఒకసారి జరిగే ఈ సమావేశానికి అధికారులు,ప్రజాప్రతినిధులు చాలావరకు గైర్హాజరు అయ్యారు.మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ తమ శాఖల గురించి వివరించి సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలని కోరగా జడ్పీటిసి సుంకన్న మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారని పోలీస్,విద్యాశాఖ సంయుక్తంగా తల్లితండ్రులతో సమావేశం జరిపి సన్మార్గంలో నడిపేందుకు కృషి చేద్దామని కోరారు.పశువులకు సంబంధించిన లంపి స్కిన్ రోగంపై అవగాహన కల్పించి వైద్యసేవలు అందించాలని పశువైద్యాధికారిణిని ఆదేశించారు.అదేవిధంగా వెల్దుర్తి సిహెచ్‌సికి సంబంధించి డాక్టర్.బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ 30 పడకల ఆసుపత్రి అన్ని హంగులతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని,ప్రస్తుతం అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు తాము సిద్ధమన్నారు.స్టాఫ్‌నర్సు కొరత ఉందని జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఇందుకు ఎంపిపి తీరా ్మనంతో నివేదికలు పంపుతామని ఎంపిడిఓ వివరించారు.అనంతరం ఎంపిపి మాట్లాడుతూ మండలంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తా ్మన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి బొమ్మన సరళారవిరెడ్డి,మండల వైకాపా కన్వీనర్,ఎంపిటిసిలు బొమ్మనరవిరెడ్డి,పుల్లగుమ్మి నాగార్జునరెడ్డి,సర్పంచ్ ముత్యాల శైలజ,జడ్పీటిసి దాదిపోగు సుంకన్న,ఎంపిడిఓ శ్రీనివాసరావు,డిప్యూటీ తహశీల్దార్ దీపిక (రీసర్వే),ఇఓఆర్డీ నరసింహులు,సిహెచ్‌సి డాక్టర్.బాలచంద్రారెడ్డి,పిఆర్ ఏఇ సురేంద్రరెడ్డి,ఏఓ అక్బర్‌బాష,ఎంఇఓ ఇందిర,పశువైద్యాధికారిణి శాంతలత,ఏపిఓ రాజునాయక్,విద్యుత్ ఏఇ రాఘవేంద్రప్రసాద్,ఆర్‌డబ్ల్యుయస్ ఏఇ మునెయ్య,ఆర్‌ఐ అబ్దుల్‌కలాం,సచివాలయం సిబ్బంది,ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయరాజధాని సాధించుకుందాం
### -ఏపీఎస్పీడిసిఎల్ డైరెక్టర్, రీజినల్ కో-ఆర్డినేటర్

**కర్నూలు విద్య, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాయలసీమ వాసుల హక్కు న్యాయరాజధానిని పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ ఎస్పీడిసిఎల్ డైరెక్టర్, రీజినల్ కో-ఆర్డినేటర్ పిబి శశికళా అన్నారు. శనివారం విద్యుత్‌భవన్ గేస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పిబి శశికళా మాట్లాడుతూ శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమకు న్యాయరాజధాని ఇవ్వాలన్నారు. రాయలసీమ వాసులుగా న్యాయరాజధాని కోసం పార్టీలకతీతంగా మహిళలు చైతన్యం చేసి 5వ తేది ఎస్టీబిసి కళాశాలలో జరుగు రాయలసీమ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. 1953లో కర్నూలు రాజధానిగా ఉండేదని మదరాసు నుంచి విడిపోయిన తరువాత రాజధానిని హైదరాబాదుకు మార్చారని కర్నూలు నుండి హైదరాబాదుకు త్యాగం చేశామన్నారు. ఒకేచోట రాజధాని ఉండడం వల్ల పరిశ్రమలు, విద్యాలయాలు అన్ని అక్కడికే చేరి రాయలసీమ తీవ్ర అన్యాయానికి గురైందని చెప్పారు. మళ్లి తెలంగాణ నుండి విడిపోయిన సందర్భంగా కూడ వెనకబడ్డ రాయలసీమ, ఒకనాటి రాజధాని అయిన కర్నూలు తీవ్ర అన్యాయానికి గురవుతూ వచ్చిందన్నారు. వికేంద్రీకరణ లేకపోవడం వల్లే రాయలసీమ వాసులు తీవ్ర నష్టాన్ని చవిచూశారన్నారు. కర్నూలుకు న్యాయరాజధాని వస్తే రాయలసీమ వాసులందరికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. రవాణా సౌకర్యాలు పెరిగి పరిశ్రమలు కూడ వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. శ్రీకృష్ణ కమిటీ, శివరామకృష్ణ కమిటీల నివేదిక ప్రకారం వెనకబడ్డ రాయసీమకు న్యాయరాజధాని ఇవ్వాలని ఉన్నప్పటికి ఆ విషయాలను తుంగలో తొక్కి కర్నూలుకు హైకోర్టు రాకుండా చేశారన్నారు. సమావేశంలో కార్పొరేటర్ అరుణ, వైసీపీ మహిళావిభాగం కార్యదర్శి సుభాషిని, ఉపాధ్యక్షురాలు నారాయణమ్మలు పాల్గొని మాట్లాడారు.

## డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ సందర్శసందర్శన

**నంద్యాల విద్య, డిసెంబరు 3, ప్రభాతవార్త:** కర్నూలు పట్టణాభివృద్ధి కూడ ప్రచరించిన నంద్యాల డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను నంద్యాల పురపాలక సంఘ కార్యాలయం నందు ప్రచురించడమైందని మున్సిపల్ కమిషనరు చింతా రవిచంద్రారెడ్డి తెలిపారు. ఎటువంటి చార్జీలు లేకుండా పట్టణంలోని ప్రజలు ఈడ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌ను సందర్శించవచ్చు. నెలరోజుల పాటు మున్సిపల్ కార్యాలయంలో ఈయొక్క ప్లాన్‌ను పరిశీలనార్థం ఉంచబడును. మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల యందు ఏమైనా అభ్యంతరాలు, సూచనలు, సలహాలు, వున్నయెడల మున్సిపల్ అఫీసునందు రాతపూర్వకంగా లేదా మెయిల్ ద్వారా నెలరోజుల్లో పంపాలని ఆయన అదేశించారు. సమావేశంలో అసిసెంటు కమిషనరు వెంకటదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఆలూరు గిరిజన గురుకుల విద్యార్థినీలు ఎంపిక

**ఆలూరు,డిసెంబరు 3,ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఆలూరు గిరిజన గురుకుల నుండి ఐదుమంది విద్యార్థినీలు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జమ్మన్న తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అండర్-17విభాగంలో ఎస్ పావని భాయి,టెన్నికోయిట్‌లో బి మాధవి,ల్యాండ్ బాల్‌లో రేణుకభాయి, అథ్లెటిక్స్‌లో ఎస్ శిరీషభాయి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికయ్యారన్నారు. నియోజకవర్గ స్థాయి నుండి జిల్లా స్థాయికి వాలీబాల్ సెలక్షన్‌లో అండర్-14విభాగం నుండి ఐసమ్మ,పి అనూషభాయి,ఆర్ లావణ్య,అండర్-17విభాగంలో వైకే శ్రీదేవి,ఎస్ శిరీషాభాయి,రేణుకభాయి,బి మాధవ,ఎస్ పావనిలు ఎంపికయ్యారన్నారు. ఎన్నికైన విద్యార్థినీలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే పాఠశాలకు,నియోజకవర్గానికి గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినీలను పాఠశాల ఉపాధ్యాయులు రాజేంద్ర,రంగబాబు,మల్లికార్జున, విజయకుమారి, ఉమా మహేశ్వరి,సూర్యప్రకాష్,వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాప్‌లు అభినందించారు.

## రాయలసీమకు అన్యాయం చేస్తే ఊరుకోం

**ఆదోని,డిసెంబరు 3,ప్రభాతవార్త :** రాయలసీమకు అన్యాయం చేస్తూ కపట ప్రేమతో రాయలసీమ గర్జనలు చేస్తూ ప్రజలను మోసం చేస్తుంటే చూస్తూ ఊరుకోమని సీమ గర్జనను అడ్డుకుని తీరుతామని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు హెచ్చరించారు. శనివారం పట్టణంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ రేపు కర్నూలులో వైకాపా సీమ గర్జన కార్యక్రమం ఏర్పాటు చేయడం హాస్యాస్పదమని దుయ్యబట్టారు. ప్రభుత్వం మూడేళ్ల నుండి సీమకు ఏం అభివృద్ధి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు ప్రాతాల పేరుతో ప్రాంతీయ విద్వేశాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుతూ సీమకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సూర్య,రాజా రత్నం,నూర్,తుకారాం,నాగరాజు,రాజు తదితరులున్నారు.

## జయహో బీసీ మహాసభను జయప్రదం చేయండి



**బనగానపల్లె,డిసెంబర్3,ప్రభాతవార్త:** విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ గ్రౌండ్‌లో డిసెంబర్ 7వ తేదిన జరగనున్న జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలని బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు.శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జయహో బీసీ మహాసభకు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు,వార్డుమెంబర్లు,జెడ్పీటీసీలు, ఎంపిటీసీలు,మండల పరిషత్ అధ్యక్షులు,వివిధ బీసీ ఉపకులాలకు సంబంధించిన వారు,మార్కెటింగ్ డైరెక్టర్లు అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు.

## ప్రభుత్వ హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా చేయాలి

**ఆస్పరి,డిసెంబరు 3 ,ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నహోతూరు గ్రామంలో తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు శనివారం హాస్టల్‌ను పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఆలూరు తాలుక అధ్యక్షుడు తలారి సిద్దప్ప మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా చేయాలన్నారు. కాస్మోటిక్,మెస్ చార్జీలు పెంచాలి,హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు,ప్లేట్లు,ట్రంక్‌పెట్టెలు తదితర మౌలిక సదుపాయాలు ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పరి మండల అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడుతూ సరైన వసతులు,భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. హాస్టల్‌లో మంచి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

## సీమగర్జనకు భార్తీన తరలివచ్చి విజయవంతం చేయాలి

**హొళగుంద,డిసెంబరు 3,ప్రభాతవార్త :** రేపు కర్నూలులో జరిగే సీమగర్జనకు ప్రజలు భారీఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ,వైకాపా మండల కన్వీనర్ షఫీవుల్లా,ఎంపిపి తనయుడు ఈసా,సింగిల్‌విండో చైర్మన్ మేలిగిరి మల్లికార్జునలు పిలుపునిచ్చారు. శనివారం ఎంపిడిఓ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. కరువుకు నిలయంగా ఉన్న రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయడం వల్ల అనేక లాభాలున్నాయన్నారు. వ్యయప్రయాసాలు తగ్గడం,ఇతర అభివృద్ధి పనులు జరగడానికి దోహదపడుతుందన్నారు. పరిపాలన వికేంద్రీకరణలో 3రాజధానుల ఏర్పాటు వల్ల రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని ఇందుకు ప్రతిఒక్కరు మద్దతిస్తూ 5న కర్నూలులో జరిగే గర్జన కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కుమారస్వామి,వైస్ ఎంపిపి గాదెమ్మ,కోగిలతోట శేషప్ప,వెంకటరెడ్డి,మౌలాలి,వెంకటరామిరెడ్డి, రమేష్,దర్గన్న,నాగప్ప,ఎంపిటిసిలు శివన్న,ఉరుకుందప్ప,హనుమప్ప,మల్లయ్య,మృత్యుంజయ,సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## కోట్లను విమర్శించే స్థాయి నీ.. కెక్కడిది ?

**(మొదటి పేజీ తరువాయి)** రాష్ట్రంలో వైకాపా అభివృద్ధి సాధించ లేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నేడు ఆ పార్టీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి వికేంద్రీకరణ పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగా నేడు తలపెట్టిన రాయలసీమ గర్జన అని అన్నారు. కర్నూలుకు న్యాయ రాజధాని ఏర్పాటుకు తెలుగు దేశం పార్టీ వ్యతిరేకం కాదన్నారు. ప్రస్తుతం అధికారంలో వైకాపా ఉందని, వారు తలుచుకుంటే న్యాయ రాజధానిని తీసుకు రావచ్చు కదా..? అని అన్నారు.ప్రత్యేక హోదాను పక్కకు నెట్టిన వైకాపా : ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదానే సాధించడమే వైకాపా ప్రధాన ఎజెండగా చెప్పిన నేతలు నేడు వాటి ప్రస్తావనే తీసుకురావడం లేదని టీడీపీ శ్రేణులు సి.బి లత, కె.హెమాద్రిరెడ్డి ఆరోపించారు. ప్రతి పక్షహోదాలో ఉన్న పార్టీలు చేయాల్సిన పోరాటాలు అధికార పార్టీయే పోరాటాలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ లబ్ది కోసం వైకాపా పార్టీ ప్రజలను తప్పుదోవ పటించే ందుకు రాజకీయాలు చేసినా ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇలాంటి రాజకీయాలనే బివై రామయ్య ముఖ్యమంత్రి దగ్గర మెప్పు పొందడానికి కోట్లను విమర్శిస్తున్నారన్నారు. రామయ్య ఎక్కడి నుంచి వచ్చారో ఎవరి వల్ల నేడు రాజకీయ హోదాను అనుభివిస్తున్నారో అన్న విషయాలు జిల్లా ప్రజలకు తెలుసునని వారు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, ఎల్లప్పనాయుడు,గోరంట్ల తిరుమలనాయుడు,బడెస్సా,గోరంట్ల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు సమాజంలో ఒక భాగం

**నంద్యాల విద్య, డిసెంబరు 3, ప్రభాతవార్త:** దివ్యాంగులు సమాజంలో ఉన్నత పదవులు, ఉద్యోగాలు పొందివున్నారని వారికి ఎంతో గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, ఐఎంఎ రాష్ట్రశాఖ అధ్యక్షులు డా.రవికృష్ణ పేర్కొన్నారు. శనివారం నంద్యాల లయన్స్‌క్లబ్ ఐఎంఎ మహిళా విభాగం అధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత ్సవం ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఐఎంఎ అధ్యక్షులు డా.జప్రుల్లా, కార్యదర్శి డా.చంద్రశేఖర్, కోశాధికారి డా.ఫనిల్, రాష్ట్ర కమిటీ సభ్యులు డా.మధుసూధన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి చంద్రమోహన్, కూర ప్రసాద్, రత్నకుమార్, వైద్యులు డా.నాగమణి, డా.వసుధ, డా.లక్ష్మీసౌజన్య, డా.మాధవి, డా.కుసుమ, లయన్స్‌క్లబ్ ప్రాంతీయ చైర్మన్ కొత్తి చంద్రశేఖర్, సీనియర్ సభ్యులు గోళ్ళసుదర్శనం నంద్యాల దివ్యాంగుల సంక్షేమ అధ్యక్షులు సుబ్బారెడ్డి, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రమణయ్య, కార్యదర్శి చలపతి, ఉపాధ్యక్షులు వెంకటరావు, బాలఅకాడమి రవీంద్రలు పాల్గొని 350 మంది దివ్యాంగులకు నూతన వస్త్రాలను దీర్ఘకాలిక జబ్బులకు నెలసరి మందులను, మోటార్‌తో పనిచేసే కట్టుమిషన్లు పేద దివ్యాంగ మహిళలకు పంపిణి చేశారు. ప్రతిసంవత ్సరం 1000 మందితో నిర్వహించేవారమని ఈసారి 350 మందితో నిర్వహించామని పేర్కొన్నారు. దివ్యాంగులకు ప్రతినెల 150 నుంచి 200 మంది సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఏ సమస్యలు వచ్చినా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సంప్రదిస్తే పనులన్ని సక్రమంగా జరిగేవిధంగా చుస్తామని హామిఇచ్చారు. సమావేశంలో హనిఫ్‌ఖాన్, యూసుప్, రామకృష్ణుడు, నిజాముద్దిన్ పాల్గొన్నారు.

## మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకృష్ణ

**దొర్నిపాడు,డిసెంబర్3,ప్రభాతవార్త:** దొర్నిపాడు మండల వ్యవసాయాధికారిగా శ్రీకృష్ణ బాధ్యతలను చేపట్టారు.నియోజకవర్గ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఓడీ పైన వ్యవసాయాధికారుల బదిలీలు చేపట్టారు.ఇందులో భాగంగానే దొర్నిపాడు మండలానికి శ్రీకృష్ణను కేటాయించారు.దొర్నిపాడు మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న సునీతను వెలుగోడుకు బదిలీ చేయగా రుద్రవరం మండలంలో వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న శ్రీకృష్ణను దొర్నిపాడు మండలానికి బదిలీ చేశారు.దీంతో శ్రీకృష్ణ దొర్నిపాడు మండల వ్యవసాయాధికారిగా శనివారం బాధ్యతలు చేపట్టారు.

## టిడ్కో గృహాలు లబ్దిదారులకు అందజేయాలి - 5తేదిన ధర్నా నిర్వహిస్తాం

**నంద్యాల విద్య, డిసెంబరు 3, ప్రభాతవార్త:** టిడ్కో గృహాలను జిల్లావ్యాప్తంగా లబ్దిదారులకు అందజేయాలని, జగనన్న కాలనీకి రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఐ జిల్లాకార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దిన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయకార్యదర్శి సోమన్నలు ప్రసంగించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో నంద్యాల, డోన్, ఆళ్లగడ్డ ప్రాంతంలో దాదాపు 12 వేల గృహాలు 90 శాతం పనులు గత ప్రభుత్వం పూర్తిచేసిందని కేవలం 10 శాతం పెండింగ్ పనులను ఈప్రభుత్వం పూర్తిచేయకుండా లబ్దిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని వాపోయారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత ్సరాలు అయిన ఇంతవరకు వాటిని పూర్తిచేయకపోవడం దారుణమన్నారు. జగనన్న కాలనీలో ఇంటినిర్మాణానికి కేవలం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తున్నారు. ఇంటినిర్మాణం పూర్తికావడం లేదని రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 5న మున్సిపల్, తహశీల్దార్ కార్యాలయాల ముందు అందోళన చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలకు అందరము శ్రమిద్దాం

**కోవెలకుంట్ల,డిశంబరు 3,ప్రభాతవార్త :** గ్రామాల్లో అ సాంఘిక కార్యకలాపాలలో ఓటి అయిన నాటు సారాయి నిర్మూలకు అందరము కలిసి శ్రమిద్దామని ఎన్ఫోర్స్మెంటు సిఐ శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. నాటు సారాయి నిర్మూలించడానికి పరివర్త పోగ్రాం నిర్వహించాలని జిల్లా అధికారులు అదేశాల మేరకు శనివారము స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఉపసర్పంచు సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన పరివర్త పోగ్రాం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సిఐ మాట్లాడుతూ నాటు సారాయి అసాంఘిక కార్యకలాపాలో చాలా అపాయమైనదని దానిని నిర్మూలనకు అందరు నడుంబిగించాలని ఎక్కడే అది కనిపించిన అలాగే సరఫరా చేస్తు మాకు సమాచారము అందించాలని కోరారు. అలాగే తయారు చేస్తున్నవారు,అలాగే వ్యాపారులు ఇకనైన దాని జోలికి వెళ్లవద్దని కోరారు.మీరు దానికి దూరంగా ఉంటే ప్రభుత్వం మీకు పునరావాసము కల్పిస్తుందని చెప్పారు. చిన్న చిన్న వ్యాపారులు చేసుకోని అందరి ముందు తల ఎత్తుకు జీవించాలని కోరారు. ఈనాటు సారాయి వ్యాపారము చేయడము వల్ల పది మందిలో చులకన బావము ఏర్పడుతుందని అది మా కుటుంబాలకు కూడా మచ్చ తెస్తుందని చెప్పారు.అలాగే మీ పిల్లలకు కూడా సమాజములో చాలా చెడ్డ పేరు వస్తుందని కావున దానికి దూరముగా ఉండాలని పిలుపు నిచ్చారు.

## చెవలకాయ పంట గంజహళ్ళి టూ తెలంగాణా



**గోనెగండ్ల డిశంబరు 3 ప్రభాతవార్త :** కాయ గూరలలో చెవలకాయ ఒకటి అయితే ఈ చెవల కాయ పంటను గోనెగండ్ల మండలంలో పలు గ్రామాల్లో పండిస్తున్నారు. అందులో గంజహళ్ళి లో రైతులు పండించే పంటను తెలంగాణాకు సరఫరా చేస్తున్నారు.అయినప్పటికి పండిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని చెవలకాయ పంటను సాగు చేసిన రైతులు వాపోతున్నారు.గంజహళ్ళి గ్రామానికి చెందిన రాముడు అనే రైతు ఒకటిన్నర ఎకరంలో చెవలకాయ పంటను సాగు చేశారు.ఎకరంకు రూ.15వేలు పెట్టుబాడి వచ్చింది.అయితే ప్రస్తుతం ఉన్న ధరలు రైతుకు గిటుబాటు కావడం లేదని వాపోతున్నారు. పంట వారంకు ఒకసారి కోతకు వస్తుంది.కోతకు వచ్చినప్పడల్లా 25 మంది కూలీలు అవసరం ఒక్కకూలీలకి రూ.250 ప్రకారం ఇవ్వాలి.ఇక్కడ నుంచి తెలంగాణకు రవాణ ఖర్చులు 10 కేజీల ప్యాకెట్‌కు రూ.100 ఇవ్వాలి.అక్కడ మార్కెంట్ లో పది కేజిల ఫ్యాకెట్ రూ.120 నుంచి రూ.150లోపు ధర పలుకుతుంది. వారం కు 5నుంచి 8 ప్యాకెట్లు పంట దిగుబడి వస్తుంది.దీంతో పండిన పంట మొత్తం కూలీలకు,పెట్టుబడికి, రవాణ ఖర్యులకే సరి పోతుందని చేతికి ఏమీ మిగలడం లేదని రైతులు వాపోతున్నారు.

**-గిటుబాటు ధర కల్పించాలి:-రాముడు చెవలకాయ పంట రైతు గంజహళ్లి** చెవలకాయ పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి.మన రాష్ట్రంలో ధర పలకక పోవడంతో తెలంగాణాకు పంపుతున్నాము.అక్కడ గిట్టుబాటు ధర లేదు.10 కేజీల ప్యాకెట్ రూ.300 నుంచి రూ.400 వరకు ధర పలికితే గిట్టుబాటు అవుతుంది.గిట్టుబాటు ధర కలి ్పంచి ప్రభుత్వం రైతులను అదుకోవాలి

## రాయలసీమ సింహాగర్జనను విజయవంతం చేయండి-ఎంపిపి బొమ్మన సరళారవిరెడ్డి

**వెల్దుర్తి,డిసెంబర్3,ప్రభాతవార్త :** కర్నూలు నగరంలోని ఎస్టీబిసి కళాశాల మైదానంలో జరిగే రాయలసీమ సింహాగర్జనకు మండలంలోని అన్నివర్గాల ప్రజలు,మేధావులు,విద్యావేత్తలు,న్యాయవాదులు,వైకాపా నాయకులు,కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎంపిపి బొమ్మన సరళారవిరెడ్డి అన్నారు.స్థానిక ఎంపిపి కార్యాలయంలో శనివారం ఆమె మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి,వైకాపా నాయకులు,సర్పంచులు,జడ్పీటిసి సభ్యునితో కలిసి మాట్లాడారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోరుతూ 3 రాజధానులు చేశారని అందులో కర్నూలుకు న్యాయరాజధానిగా ప్రకటించడం జరిగిందన్నారు.అయితే ప్రతిపక్షాలు కుట్రపన్ని అడ్డంకులు సృష్టిస్తున్నాయన్నారు.వికేంద్రీకరణకు మద్దతుగా,కర్నూలు న్యాయరాజధాని ప్రకటనకు సంఘీభావంగా చేపడుతున్న రాయలసీమ సింహాగర్జనకు అందరు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.ఇది కేవలం పార్టీకి సంబంధించిన అంశం కాదని ప్రతి ఒక్కరిదన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ బొమ్మనరవిరెడ్డి,సర్పంచ్‌లు ముత్యాల శైలజ,నిర్మల,జడ్పీటిసి దాదిపోగు సుంకన్న,జిల్లా వైకాపా నాయకులు ఆగస్టీన్,పుల్లగుమ్మి నాగార్జునరెడ్డి,బుక్కాపురం శంకర్‌రెడ్డి,వైఎస్ ఎంపిపి రంగయ్య,సూదేపల్లి వెంకటేశ్వరరెడ్డి,వెంకటనాయుడు,జి.యస్.ఆరిఫ్,రాజు,దేవరాజు,డేవిడ్,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

**హొళగుంద,డిసెంబరు 3,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఇంగళదహాలు గ్రామంలో వైసిపి మండల నాయకుడు పింజారి చిన్న తండ్రి పింజారి లాల్‌సాబ్(57) గుండెపోటుతో మృతిచెందారు. ఆయన పశువుల కాపరిగా పశువులను మేపడానికి రోజుమాదిరిగా వెళ్లడం జరిగింది. మధ్యాహ్న సమయంలో గుండెపోటు రావడంతో పొలాల్లోనే మృతిచెందడం జరిగింది. పింజరి లాల్‌సాబ్ చిన్ననాటి నుండి పశువుల కాపరిగా ఉంటూ చివరి క్షణంలో కూడా పశువులను మేపుతూ తుదిశ్వాస విడవడంతో గ్రామస్తులు చలించిపోయారు.

## ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించండి

**గడివేముల, డిశంబర్03, ప్రభాతవార్త ;** ఉపాధ్యాయులపై కక్ష్య సాధింపు చర్యలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు మూడవ తేదీ వచ్చినా కూడా జీతాలు చెల్లించకపోవడంతో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సాంబశివుడు, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం నాడు గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఏపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తేదీన జీతాలు అందుతాయనే నమ్మకం లేకుండా పోయిందన్నారు. కొద్ది నెలల నుంచి వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పోలీసు, వ్యవసాయ, ఆరోగ్య, ట్రెజరీ, మండల పరిషత్ తదితర శాఖల సిబ్బందికి ఒకటో తేదీన జీతాలు జమ చేసి కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గపు చర్యగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఒకనైనా స్పందించి ఒకటో తేదీన జీతాలు చెల్లించేవిధంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమం అనే నెపంతో ఐదు సంవత్సరాలకు జరిగే ఎన్నికల విధులకు దూరం చేయడం జరిగిందని, మరినాడు నేడు పనులు వివిధ రకాల యాప్‌లు ప్రతిరోజు చేసే బోధనేతర పనులు కావా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నాడు-నేడు పనుల నుంచి వివిధ రకాల యాప్‌ల నుంచి హెచ్ఎంలకు, ఉపాధ్యాయులకు విముక్తి కలిగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.మహబూబ్‌బాషా, మండలశాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.నాగన్న, మానపాటి రవికుమార్, జిల్లా నాయకులు ఆవుల మునిస్వామి, మల్లెల పుల్లయ్య, నిగిరి వెంకటేశ్వర్లు, ఆర్.జయరాం, ఎం.పవన్‌కుమార్, ఎల్.బాలస్వామి, బాల వెంకటేశ్వర్లు, క్రిష్ణమూర్తి, విశ్వనాథమయ్య, కాత వెంకటరామిరెడ్డి, రమణయాదవ్, రామాంజనేయులు, వెంకటరమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భవిత సెంటర్‌లో దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

**గడివేముల, డిశంబర్03, ప్రభాతవార్త ;** స్థానిక భవిత సెంటర్‌లో దివ్యాంగులు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఎంఈఓ రామకృష్ణుడు ఆధ్వర్యంలో శనివారంనాడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా సీడబ్ల్యూఎస్ ఎన్ విద్యార్థులందరూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దివ్యాంగుల కాదు విభిన్నప్రతిభావంతులు, దివ్యాంగుల విద్య ప్రాథమిక హక్కు అని స్లొగన్‌లు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ రామకృష్ణుడు మాట్లాడుతూ సీడబ్ల్యూఎస్ అని పిల్లలు బాధ బాధపడకుండా ఉన్నత చదువులు చదివి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీర్‌లు కావాలన్నారు. రిసోర్స్ ఉపాధ్యాయులు ఫకీర్‌సాహెబ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్ పోర్ట్ అలవెన్స్, స్టైఫండ్ అలవెన్స్, హెచ్‌బీ అలవెన్స్, రీడర్ అలవెన్స్ మరియు స్కాలర్‌షిప్‌లు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌టీ టీచర్ ఆంజనేయులు, ఐడీఎస్ టీచర్ ఎస్.బాలస్వామి, సీడబ్ల్యూఎస్ పేరెంట్స్, సీఆర్‌పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, భవిత ఆయా రాణి పాల్గొన్నారు.

## రాయలసీమ సింహ గర్జనను విజయవంతం చేయండి

**తుగ్గలి,డిసెంబరు 3,ప్రభాతవార్త :** కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న కర్నూలులో ఎస్‌టిబిసి మైదానంలో జరగబోయే రాయలసీమ సింహ గర్జన కార్యక్రమానికి తప్పకుండ హాజరై విజయవంతం చేయాలని తుగ్గలి ఎంపిటిసి రాజు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వికేంద్రీకరణలో భాగంగా రాయలసీమలోని కర్నూల్‌లో న్యాయరాజధాని ఏర్పాటుకై ప్రజలందరు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

## సమాజంలో కీలకపాత్ర పోషించేది విలేఖరులే

**నంద్యాల, డిసెంబరు 3, ప్రభాతవార్త:** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు పనిచేస్తున్నాయని ప్రభుత్వ పథకాలకు ప్రజల్లోకి తీసుకెళ్ల్లడం, ప్రజాసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో పత్రికలు విశేషపాత్ర పోషిస్తున్నాయని మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, డిఆర్వో పుల్లయ్య, ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో డిప్యూటి డైరెక్టర్ హేల్‌కేరి, డిపిఆర్వో జయరావు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డా.రామకృష్ణరెడ్డి, సీనియర్ జర్నలిస్టు జనార్ధన్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి లీలావతిలు పేరొ ్కన్నారు. శనివారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల మిని కాన్ఫరెన్స్ హాల్‌లో భారత ప్రభుత ్వం కేంద్ర ప్రసార మంత్రిత్వశాఖ అధ్వర్యంలో విలేఖరులకు వార్త లాప్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని కేంద్ర క్షేత్ర ప్రచారవిభాగ అసిస్టెంటు డైరెక్టరు శివహరినాయక్ అధ్వర్యంలో శిక్షణకార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతికూల వార్తల కన్న అనుకూల వార్తలపై ప్రతే ్యకపోకస్ పెట్టి ప్రజలను చైతన్యం తీసుకురావాలన్నారు. సమాజంలో ఏది జరిగినా ముందుండేది ముందు ఉండేది పా త్రికేయుడేనని జర్నలిస్టు ఎప్పుడే హీరో అని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో జర్నలిస్టులు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని సోషల్‌మీడియా, విస్ఫంఖలత్వంగా పరిణమిస్తున్న కారణంగా ఫెస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్‌లకు రేటింగ్ శాతం పెరిగింది. డిప్యూటి డైరెక్టర్ హేలికేరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను అట్టడుగుస్థాయి ప్రజలకు తీసుకెళ్లేందుకు మీడియాపాత్ర కీలకమైందన్నారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రధానమంత్రి అవాస్‌యోజన, పిఎం కిసాన్, ప్రధానమ ంత్రి ఉజ్వలయోజన తదితర ప్రభుత్వ పథకాల ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పత్రికారంగం లేనిదే సమాజం లేదని సమాజంలోని ప్రతిసమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పత్రికలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. జర్నలిస్టులు, నిష్పక్షపాతమైన వార్తలు రాసినప్పుడే నిజమైన హీరోలని కితాబునిచ్చారు. కరోనా సమయంలో పత్రికల కృషి ప్రశంసనీయం అన్నారు. జర్నలిస ్టలకు సమాజంలో విశిష్టస్థానం ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమవంతు సహాయం చేస్తామని వక్తలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో వివిధ పత్రికలకు చెందిన పాత్రికేయులు పాల్గొన్నారు.

## కోట్లను విమర్శించే అర్హత బీవై రామయ్యకు లేదు

**గోనెగండ్ల డిశంబరు 3 ప్రభాతవార్త :** మాజీ కేంద్ర మంత్రి,టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డిని విమర్శించే అర్హత వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షుడు,కర్నూలు నగర మేయర్ బీవై రామయ్యకు లేదని వాల్మీకి సంఘం నాయకులు టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు,మాజీ సర్పంచ్ రంగముని,టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు చెన్నలరాయుడు,పెద్దలక్ష్మన్న టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి కౌలుట్లయ్యనాయుడు అన్నారు. శనివారం గోనెగండ్లలో వారు మాట్లాడుతూ సీఎం జగన్ మెప్పుకోసం అర్థరహితంగా కోట్ల కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నావాని పుట్టగతుల లేకుండా పోతావని వారన్నారు.కర్నూలు జిల్లాలో చాల గ్రామాలకు తాగునీరు,రోడ్లు,ఆసుపత్రులు ,ఇతరత్ర సౌకర్యాలు కల్పించిన ఘనత కోట్ల కుటుంబానికే దకి ్కందన్నారు. నీ వెంట పది మందికూడా లేకపోయిన బీసీ బోయ కులస్తుడని నాడు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి నిన్ను వెంట పెట్టుకొని ఈ స్థాయికి తీసుకువస్తే నేడు మతి భ్రమించి మాట్లాడటం సమంజసం కాదన్నారు.మరో సారి ఇలాంటి అవాకులు చవాకుల పేలితే నీ నాలుక చేరేస్తామని వారు హెచ్చరించారు.జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టు కోసం అప్పటి సీఎం చంద్రబాబు నాయుడితో మాట్లాడి రూ.200 కోట్ల విడుదల చేయించిన ఘనత కోట్లకే దక్కుతుందన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు నాయుడు సీఎం కావాలని జిల్లా అభివృద్ధి జరగాలంటే కోట్ల అధికారంలో ఉండాలని వారన్నరు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబునాయుడు,చిన్నవెంకటేష్,గువ్వల దొడ్డి కృష్ణ,గంజహళ్లి వెంకటేష్,కల్లపారి రంగముని,బతకన ్న,మునెప్ప,పుగ్యాల రంగన్న పాల్గొన్నారు.

## సీమగర్జనకు స్వచ్ఛందంగా కదలిరండి
### - న్యాయరాజధానితో లక్షలాది కుటుంబాలకు ఉపాధి
### - సింహగర్జనను విజయవంతం చేయండి



**బనగానవల్లె, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** సీమగర్జనకు స్వచ్ఛందంగా ప్రజలు తరలిరావాలని బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు.శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేది సోమవారం కర్నూలులోని ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఉదయం 10గంటలకు లక్షలాది మంది ప్రజలతో జరిగే రాయలసీమ గర్జనకు బనగానపల్లె నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.1937 నవంబర్ 16వ తేదిన అప్పటి మద్రాస్ స్టేట్‌లోని కాశినాథుని నాగేశ్వరరావు నివాసంలో ఒప్పందం కుదుర్చుకున్నారు ఆయన ఇంటి పేరే కాశినాథుని నాగేశ్వరరావు శ్రీబాగ్ అదే పేరును ఈ ఒప్పందానికి పెట్టారు దీనిని పెద్దమనుషుల ఒడంబడికగా పిలుస్తారన్నారు.సమాన అభివృద్ధిని సాధించడానికే ఈ ఒప్పందం ఆనాడు కుదిరిందని ఈ రెండు ప్రాంతాలకు చెందిన పెద్ద మనుషుల మధ్య ఈ ఒప్పందం ప్రకారం అత్యంత వెనుకబడిన ప్రాంతం కావడం వల్ల జనవనరుల్లో రాయలసీమ ప్రాంతానికి అధిక వాటా దక్కాలని ఇందులో పొందుపరిచారన్నారు.కర్నూలులో రాజధాని లేదా హైకోర్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు.రాయలసీమకు చెందిన మెజార్టీ ప్రజలు దేనిని కోరుకుంటే దానిని రాయలసీమలో ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆనాడు ఈ ఒడంబడిక ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు.కడప కోటిరెడ్డి,కల్లూరు సుబ్బారావు,హెచ్.సీతారామిరెడ్డి, భోగరాజు,పట్టాభి సీతారామయ్య తదితరులు ఈ ఒడంబడిక మీద సంతకాలు చేశారు.ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా రాయలసీమ కర్నూలులోనే రాజధానిని ఏర్పాటు చేయడం జరిగింది.ఆనాడే ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు.కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రాజధాని పోవడం జరిగిందని తెలిపారు.రాయలసీమ కర్నూలులో అభివృద్ధి జరగాలని శ్రీబాగ్ ఒప్పందంలో కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని ఒప్పందం కుదిరింది.హైదరాబాద్‌కు రాజధాని వీడిపోవడం జరిగింది.2014లో సపరేట్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం జరిగిందన్నారు.2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రాయలసీమకు న్యాయం చేయలేదు.అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు కొనుగోలుచేసి రాజధాని ఏర్పాటు చేయదలచారని తెలిపారు.తెలంగాణ రా ష్ట్ర ఏర్పడిన తరువాత నీటి సమస్యలు ఏర్పడ్డాయని ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుని న్యాయరాజధానిని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే రాయలసీమ గర్జనకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.నియోజకవర్గంలో ఉన్న మేధావులు,న్యాయవాదులు,ప్రజా సంఘాలు,ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలు,వైసీపీ నాయకులు,కార్యకర్తలు సోమవారం 5వ తేది ఉదయం 7గంటలకు బనగానపల్లెలోని మార్కెట్‌యార్డు దగ్గరకు రావాల్సిందిగా ఆయన కోరారు.అక్కడి నుండి ఛలో కర్నూలుకు తరలివెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్‌మోహన్‌రెడ్డి,పత్తి రాముడు,కుమ్మరి సురేష్,గౌండా నాగరాజు,చెరువుపల్లె పుల్లయ్య,సూర్యనారా యణరెడ్డి,చాకలి సుబ్బరాయుడు,రమణ,గౌడ్,సింగనపల్లె పుల్లారెడ్డి,జి.సి.నారాయణ,బీసీ ఉపకులాల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సెబ్ ఎస్‌పై దాడి - కేసు నమోదు

**ఆదోనిటౌన్, డిశంబర్03, ప్రభాతవార్త ;** పట్టణంలోని భాస్కరెడ్డి కాలనీలో నివాసముంటున్న అక్రమ మద్యం విక్రయదారుడు మునిస్వామి సెబ్ ఎస్ఐ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాజ్, ఆకనిస్టేబుల్ విద్యపై దాడి చేసిన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. క్రాంతినగర్‌లోని న్యూగాంధీనగర్‌లో అక్రమ మద్యం తనిఖీలో భాగంగా హరిజన సావిత్రి ఇంటిలో తనిఖీ నిర్వహించారు. తనిఖీలో 192 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఆమెను విచారించారు. మద్యంప్యాకెట్లు ఎక్కడి నుంచి వచ్చాయని విచారించగా భాస్కర్‌రెడ్డి కాలనీలో మునిస్వామి అందజేసినట్లు తెలిపింది. వెంటనే ఎస్ఐ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాజ్, కానిస్టేబుల్ విద్య మునిస్వామి వద్దకు వెళితే ఆయన మద్యం మత్తులో అధికారులని చూడకుండా తోపులాట చేసి దాడి చేశారని తెలిపారు. అలాగే వారిని నానా దుర్భాషలాడారని చెప్పారు. వెంటనే ఆయనను అదుపులోకి తీసుకొని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు చెప్పారు.

## 6న శ్రీ మద్దిలేటిస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ఎన్నిక

**బేతంచెర్ల, డిసెంబర్3, ప్రభాతవార్త:** ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మినరసింహస్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలి ఎన్నిక ఈనెల 6వ తేదిన జరగనున్నదని ఈవో పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. 6వ తేది ఉదయం 9గంటలకు ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం జరుగుతుందన్నారు. 11గంటలకు ఛైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి స్వామివారి భక్తులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నకిలీ పత్తివిత్తనాల మోసం - రైతుల ఆవేదన



**అవుకు, డిసెంబర్3, ప్రభాతవార్త:** రైతులకు నకిలీ పత్తివిత్తనాలు ఇవ్వడం వల్ల మోసపోయామని అవుకు మండలంలోని పలు పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతులను విత్తనాల కంపెనీలు మరియు డీలర్లు నట్టేట ముంచుతున్నారని వారి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాల వల్ల రైతులను మోసంచేసి లాభాలు గడించేందుకు విత్తనాల డీలర్లు చూస్తున్నారని కాని రైతులకు లాభం వస్తే రైతులతోపాటు మిగతా వర్గాలన్ని బాగుపడతాయని ఆలోచన లేకుండా అమాయక రైతులను మోసం చేయడం తగునా అని రైతులు ప్రశ్నించారు. ఈ విషయం పై మండల వ్యవసాయాధికారిని న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఉప్పలపాడు, మెట్టుపల్లె గ్రామాలకు చెందిన రైతులు కృష్ణ, రహిమాన్ ఖాన్, రసూల్ ఖాన్, అంజి, వరశేషన్నలతో పాటు మరి కొంత మంది రైతులు బనగానపల్లెలోని పవన్ ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులో పత్తి విత్తనాలను కొనుగోలు చేశామని రైతులు తెలిపారు. అయితే ప్రస్తుతం పంట కాపు దశకు చేరుకున్న సమయంలో పంట చేతికి రాకపోవడంతో నకిలీ విత్తనాలని గుర్తించి సంబంధిత విత్తనాలు తీసుకున్న డీలర్ వద్దకు వెళ్లి అడగ్గా డీలర్ నిర్లక్ష్య సమాధానం చెప్పి దాటవేశారని రైతులు తెలియజేశారు. కంపెనీ ప్రతినిధులు వచ్చి పంటలను చూసి వాతావరణ మార్పు వల్ల ఇలా జరిగిందని దాటవేసే సమాధానం చెప్పినట్లు రైతులు తెలియజేశారు. ఉప్పలపాడుతోపాటు మెట్టుపల్లెలో కూడా రైతులు గంగ, కావేరి, అంకూర్ సీడ్స్ పత్తి పంటలు సాగు చేశారు. మొత్తం 15ఎకరాల్లో పత్తిపంటను సాగుచేసినట్లు రైతులు తెలియజేశారు. పంట దిగుబడి మాత్రం ఎకరాకు క్వింటా కూడా రాలేదని రైతులు తెలియజేశారు. ఒక్కొక్క రైతు దాదాపు రూ.2లక్షల మేర పెట్టుబడి రూపంలో ఖర్చు చేశామని సంబంధిత రైతులు తెలియజేశారు. ఈ విషయం పై మండల వ్యవసాయాధికారి మరియు ప్రభుత్వం రైతులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అలాగే నకిలీ విత్తనాలను అమ్మి మోసం చేసే డీలర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ రామకృష్ణ అంత్యక్రియలు

**- కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 2లక్షల ఆర్థిక సహాయం**



రామకృష్ణ భార్యకు చెక్కు అందజేస్తున్న సీఐ

**బేతంచెర్ల, డిసెంబర్3, ప్రభాతవార్త:** నంద్యాల త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 2వ తేదిన ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ ఎద్దుల రామకృష్ణ(36)అంత్యక్రియలను శనివారం అధికార లాంఛనాలతో నిర్వహించారు. బేతంచెర్ల పట్టణానికి చెందిన కానిస్టేబుల్ రామకృష్ణ విధులు నిర్వహిస్తూ ఆత్మహత్యకు పాల్పడడం పట్టణంలోని పలువురిని దిగ్భ్రాంతికి గురిచేసింది. నంద్యాల మూడవ పట్టణ సీఐ నరసింహులు, ఎస్ఐ ప్రతాప్‌ల ఆధ్వర్యంలో ఏఆర్ పోలీసులు కానిస్టేబుల్ రామకృష్ణ అంత్యక్రియలను నిర్వహించారు. అనంతరం రామకృష్ణ భార్య హైమావతికి సీఐ నరసింహులు రూ. 2లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రామకృష్ణ కుమారులిద్దరిని ప్రభుత్వం ఆదుకునేలా చూస్తామని ఆయన అన్నారు. వారితోపాటు స్థానిక పోలీసులు, పలువురు పట్టణవాసులు అంత్యక్రియల్లో పాల్గొని రామకృష్ణకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## సచివాలయాలను తనిఖీ

**వెలుగోడు, నవంబర్ 3, ప్రభాతవార్త:** పట్టణంలోని 3,4,5, సచివాలయాలను మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ వేల్పుల జయపాల్ శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సంధర్భంగా ఆయన అటెండెన్స్ రిజిష్టర్, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిషాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు అవకాశాలు కల్పించిందని మీరు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అంధించాలని, అలసత్వం వీడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.టి.సి. రాజేష్, రైతు సంఘం అధ్యక్షులు తెలుగు రమణ, వైకాపా నాయకులు టి.బాష పాల్గొన్నారు.

## ప్యాపిలి మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తున్నా

**- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి**



పనులు ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన తో వైకాపా నాయకులు

**ప్యాపిలి, డిసెంబర్3, ప్రభాతవార్త :** ప్యాపిలి మండలంలోని ప్రతి పల్లెలో అభివృద్ధి చేసి చూపిస్తున్నానని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి అన్నారు. బావిపల్లి క్రాస్ వద్ద నుంచి పిఆర్ పల్లె వరకు బిటి రోడ్డు రూ.46లక్షలు వెచ్చించి రోడ్డు వేశారు. ఆ రోడ్డును శనివారం మంత్రి బుగ్గన ప్రారంభించారు. అదేవిధంగా మంత్రి బావిపల్లె నుంచి చంద్రపల్లి వరకు పాదయాత్ర చేశారు. ఆ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వైకాపా ప్రభుత్వంలో అందిరికి న్యాయం జరుగుతుందని వివరించారు. చంద్రపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలన్నీ అందుతున్నాయా అని మంత్రి బుగ్గన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అన్నివర్గాల వారికి నవరత్నాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బోరెడ్డి శ్రీరాంరెడ్డి, ఎంపిపి గోకుల్ లక్ష్మి, మాజీ జడ్పిటిసి దిలీప్‌చక్రవర్తి, వ్యవసాయమండలి ఛైర్మెన్ మెట్టుపల్లి వెంకటేశ్వరరెడ్డి, బోర మల్లికార్జునరెడ్డి, కలచట్ల బత్తుల రమేష్‌రెడ్డి, డోన్ ఆర్‌డిఓ వెంకటరెడ్డి, ఎంపిడిఓ ఫజుల్ రహెమాన్, ఇంచార్జ్ తహాశీల్దార్ మారుతి, ఏఓ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

## సీమ ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికే..సీమగర్జన..

**- ఆలూరు తెదేపా ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ**



**ఆలూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త :** సీమ ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికే.. సీమగర్జన..అని ఆలూరు తెదేపా ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని తెదేపా పార్టీ కార్యాలయంలో తెదేపా నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆలూరు తెదేపా ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వంలో తెదేపా అధినేత చంద్రబాబు కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు తీర్మాణం చేశారన్నారు. దానిని 22మంది ఎంపిలున్నా వైకాపా నాయకులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బెంచ్ ఏర్పాటు చేయాలన్నారు. రాయలసీమలో ప్రజలకు తాగడానికి మంచినీరు లేవని అయితే మద్యం మాత్రం యేరులై పారుతుందని ఆరోపించారు. యువతీ, యువకులకు నిరుద్యోగ బృతి కల్పించలేదని సీమలో ఇప్పటివరకు ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదన్నారు. అలాగే ఆలూరు నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఉపాధి పనులు లేక ఇతర రాష్ట్రాలకు వలసలు పెద్దఎత్తున తరలి వెళ్లిపోతున్నారన్నారు. అయితే సంబంధిత అధికారులు వారికి ఉపాధి పనులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీమగర్జన పేరుతో వైకాపా మంత్రులు జిల్లాలో తిష్ట వేశారన్నారు. మూడేళ్ల వైకాపా పాలనలో రాష్ట్ర ప్రజలు విసుగు చెందారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైకాపా పార్టీకి రాష్ట్ర ప్రజలే బుద్ధిచెబుతారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్‌యాదవ్, వాణిజ్య విభాగం రాష్ట్ర నాయకులు నారాయణ, నాగరాజు, కొమ్ము రామాంజి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## సైకో పాలన వద్దు..సైకిల్ పాలన ముద్దు.. - టిడిపి సీనియర్ నాయకులు



**ఆదోని, డిసెంబరు 3, ప్రభాతవార్త :** సైకో పాలన వద్దు..సైకిల్ పాలన ముద్దు..అని టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కర్నూలు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు దేవేంద్రప్ప, మాజీ ఎల్ఎల్‌సి చైర్మన్ రామస్వామి, సీనియర్ నాయకులు సాదీరవూఫ్, మాజీ ఆత్మచైర్మన్ ఫక్రుద్దీన్, వడ్డేమాన్ గోపాల్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, మల్లికార్జున, మాజీ ఎంపిపి మురళీలు అన్నారు. తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ల ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని 104బసాపురం గ్రామంలో ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమాన్ని తెదేపా శ్రేణులు, ప్రజలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడున్నరేళ్ల జగన్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. కనీస సౌకర్యాలు కల్పించలేని పాలకులు ప్రజలను గాలికొదిలేసి సొంత సంపాదనలో మునిగి తేలుతున్నారన్నారు. ఫలితంగా పాలన భ్రష్టుపట్టిందన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ చొరవ శూన్యమన్నారు. అత్యంత వెనుకబడిన కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయన్నారు. తుంగభద్ర రిజర్వాయర్‌లో కావాల్సిన నీళ్లున్నా మన వాటా మిగిలే ఉన్నా ఎల్ఎల్‌సి ఆయకట్టులో రెండోపంటకు నీరివ్వాలన్న ఆలోచన కూడా ఎమ్మెల్యేలు, అధికారులు చేయకపోవడం భాధ్యతారాహిత్యమన్నారు. బలహీన వర్గాలకు అందించే సంక్షేమ పథకాల్లో భారీగా కోతలు విధిస్తుండడం వల్ల చాలామంది అర్హులు ప్రభుత్వ సాయానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మఒడి, చేయూత, నేతన్న నేస్తం తదితర పథకాల లబ్ది సగం మందికి కూడా రావడం లేదన్నారు. మూడున్నరేళ్లలో ఎంతమందికి పెన్షన్లు తొలగించారో చెప్పాలన్నారు. పేదల పక్షపాతిగా చంద్రబాబు చెరగని ముద్ర వేసుకున్నారని నేడు జగన్ పేదల వ్యతిరేక పాలనను రుచి చూపిస్తున్నారని దుయ్యబట్టారు. అవినీతి అక్రమాలు, భూకబ్జాలు చేస్తున్న ఆదోని శాసనసభ్యుడికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ది చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే ఓటమికి 104బసాపురంలోనే అంకురార్పణ జరగాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెస్త మల్లికార్జున, టిడిపి సీనియర్ నాయకులు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు గుడిసె రామకృష్ణ, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్‌లు సుధాకర్, చంద్రశేఖర్, నాయకులు పరుశురాం, శివయ్య స్వామి, సోము, శేఖర్‌రెడ్డి, సాదిక్‌వలి, సయ్యద్, వాసిమ్ ఖాద్రీ, మరినాపురం షేక్షావలి, బిటి శ్రీనివాస్, ఎండి హుసేన్, 37వ వార్డు ఇంచార్జ్ విజయ్‌కుమార్, శ్రీనివాసులు, బలాదూర్ హసీన్‌భాషా, హసీన్, భరత్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశమంటే.. అధికారులకు లెక్కలేదా..?



**హొళగుంద, డిసెంబరు 3, ప్రభాతవార్త :** మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశమంటే..అధికారులకు లెక్కలేదా..అని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి తంబాకు నూర్జహాన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ గత మండల సర్వసభ్య సమావేశంలో జరిగిన సమస్యలే ఇప్పటివరకు అధికారులు పరిష్కరించనప్పుడు ఈ సమావేశాలెందుకంటూ ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. హొళగుంద మండలంలో రైతులు వేస్తున్న పంటలు తమ కళ్లముందే ఎండిపోయి పంటల కోసం పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వ్యవసాయాధికారి నరేంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం రైతన్నల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇన్‌పుట్ సబ్సీడీ, రైతు భరోసా, సున్నావడ్డీ తదితర పథకాలు అర్హులైన రైతులకు అందడం లేదని వ్యవసాయాధికారిని ప్రశ్నించారు. అలాగే మండల పరిధిలోని పెద్దగోనెహాల్ గ్రామంలో ఉన్న సచివాలయంలో ఏ ఒక్క అధికారి కూడా సమయపాలన పాటించడం లేదని సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఎంపిడిఓ దాసనాయక్‌ను ప్రశ్నించారు. సచివాలయ సిబ్బంది తమ విధులకు ఎప్పుడొస్తారో..ఎప్పుడు వెళతారో..తెలియడం లేదని మండిపడ్డారు. మండల సర్వసభ్య సమావేశం జరుగుతుండగానే ఆయా శాఖలకు చెందిన అధికారులు మధ్యలోనే బయటకు వెళ్లిపోవడం గమనార్హం. అధికారులే బయటకు వెళ్లిపోతే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటూ ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తానికి మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగిందని పలువురు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి శాఖల గురించి వివరించారు. అంతకుముందు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 3న జరుగుతున్నట్లు తనకు ఎలాంటి సమాచారం అందించలేదని సమావేశ భవనం ముందు కోఆప్షన్ సభ్యుడు సాయిభేష్ నేలమీద కూర్చొని నిరసన తెలిపారు. ఎంపిడిఓ దాసనాయక్ ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండ తమ సిబ్బందితో ముందుగానే సర్క్యులర్ అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, వైస్ ఎంపిపి సింధువళం గాదెమ్మ, సమ్మతగేరి సర్పంచ్ శోభ, సులువాయి సర్పంచ్ మౌలాలి, మార్లమడికి సర్పంచ్ తనయుడు రమేష్, ఎల్లిర్తి వైకాపా నాయకులు దర్గప్ప, ఎంపిటిసి శివన్న, సింగిల్‌విండో చైర్మన్ వందవాగిలి మల్లికార్జున, పంచాయతీ రాజ్ ఏఈ సోమప్ప, ట్రాన్స్‌కో ఏఈ ఓబులమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మనోహర్, హౌసింగ్ ఏఈ వరమ్మ, ఏపిఓ భక్తవత్సల్యం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శీభారాణి, ఆర్ఐ దినోజ్‌కుమార్, మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ట్రాఫిక్ మళ్లింపు....

**డిసెంబర్ 5న కర్నూలు ఎస్టిబిసి కళాశాల మైదానంలో రాయలసీమ గర్జన కార్యక్రమం....**



**కర్నూలు క్రైమ్, డిసెంబర్, 03, ప్రభాతవార్త ః-**కర్నూలు నగరంలో డిసెంబర్ 5 సోమవారం కర్నూలు రాయలసీమ గర్జన కార్యక్రమం సందర్భంగా సోమవారం ఉదయం నుంచి కార్యక్రమం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ మళ్ళించామని శనివారం కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ గర్జన కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుండి భారీ జన సమీకరణ రానుండడంతో వాహనాకు పార్కింగ్ ప్రదేశాలను కేకేటాయించామన్నారు. కర్నూలు మెడికల్ కళాశాల మైదానంలో వాహనాల పనార్కింగ్ శ్రీశైలం నందికోట్కూరు. ఆత్మకూరు నియోజక వర్గాల నుండి వచ్చే వాహనాలు కర్నూలు సిక్యాంపు మీదుగా వచ్చి కర్నూలు మెడికల్ కళాశాల మైదానంలో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. డోన్ నంద్యాల బనగానపల్లి ఆదోని పాణ్యం ఆళ్ళగడ్డ కర్నూలు మంత్రాలయం పత్తికొండ ఆలూరు మరియు ఎమ్మిగనూరు నియోజకవర్గాల నుండి వచ్చే వాహనాలను బళ్ళారి చౌరస్తా మీదుగా సంతోష నగర్ ఫైఓవర్ జాతీయ రహదారి మీదుగా మామిదలపాడు తుంగభద్ర బ్రిడ్జి జంక్షన్ క్రాస్ నుండి కుడి వైపుకి తిరిగి కర్నూలు నగరంలోనికి చేరుకోవాలన్నారు. కర్నూలు సు ంకేశుల రోడ్డులోని సెయింట్ జోసఫ్ కళాశాల పార్కింగ్ రాయలసీమ గర్జన కార్యక్రమానికి వచ్చే వారి భారీ వాహనాలు అన్ని కూడా సుంకేశుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసఫ్ కళాశాలలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. కోల్స్ కళాశాల మైదానం కంట్రోల్ రూమ్ దగ్గర ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పార్కింగ్ కళాశాల నుండి యూనివర్సిటి నుండి వచ్చు స్టూడెంట్స్ వాహనాల కోసము ప్రత్యేక పార్కింగ్‌ను కేటాయించడం అయినది ఎస్టిబిసి కళాశాల ఎదురుగా ఉన్న రూట్‌లో ఒక రూట్‌లో మాత్రమే వాహనాలకు ఉంటుందన్నారు. సెకండ్ రోడ్ ఎమర్జెన్సీ కోసమే ప్రత్యేకించి ఖాళిగా వుంచబడును ఎస్టిబిసి కళాశాల నుండి రాజ్ విహార్ మీదుగా గవర్నమెంట్ హాస్పిటల్ వరకు మరియు ఆనంద్ సినిమా హాల్ ముందు వున్న హంద్రీ బ్రిడ్జిని కూడా కేవలము అత్యవసర నిమిత్తం వేళ్ళే వాహనాలు మరియు ఇతర అంబులెన్సు వాహనాల కోసము ప్రత్యేకముగా ఉంచడమైనది. సభకు హాజరవు వారిని తప్ప మిగతావారిని అనుమతించబడరు దయచేసి ప్రత్యామ్నాయ మార్గాలను వాడుకోవల్సిందిగా ప్రజలను కోరడమైనది.

## కోర్టు ఉత్తర్వులతో దుఖాణాలు లక్కిడిప్‌తో నిర్వహణ



**శ్రీశైలంప్రాజెక్టు, డిసేంబర్03, ప్రభాతవార్త :** శ్రీగిరిక్షేత్రంలో ఏండ్ల తరబడి పరిస్కారంకు నోచుకోని లలీతాంబిక వాణిజ్యసముదాయం దుఖాణాలను శ్రీశైలం దేవస్థానం అదికారులు ఎట్టకేలకు కోర్టు ఉత్తర్వులను అనుసరిస్తూ శనివారంనాడు మల్లికార్జున కల్యాణ మండపంలో లక్కిడిప్ ద్వారా వ్యాపారస్తులకు దుఖాణాల కేటాయింపులు నిర్వహించడం జరిగింది. లక్కిడిప్ నిర్వహణాలో శ్రీశైలందేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న, దర్మకర్తలి మండలి అధ్క్షులు రెడ్డివారి చక్రపాణరెడ్డి మరియు సభ్యులు హనుమంతునాయక్, కనకదుర్గ, తన్నీరు దర్మరాజు, దేవస్థానం ఆయా విభాగాల అదికారులు సమక్షంలో నిర్వహించడం జరగింది. ఇందులో మొత్తం 140 దుఖాణాలకు లక్కిడిప్‌ను నిర్వహించగా వాటిలో 101 దుఖాణాల వ్యాపారస్తులు డిప్‌లో పాల్గొన్నారు. మిగత 39 దుఖాణాలకు సంబందించి కొందరు డిప్‌లో పాల్గొనకపోవడంతో నిలిచిపోయాయి. దుఖాణాల లక్కిడిప్‌ను నిర్వహించే క్రమంలో కట్టుదిట్టమైన పోలిస్ బద్రత నడుమ ప్రక్రియను నిర్వహించారు. కాగా డిప్‌లో పాల్గొనేందుకు కొందరు వ్యాపారులు విముఖత చూపడంతో సమయం దాటిపోతుండడంతో దేవస్థానం అదికారులు ముగింపు చేసారు. తదుపరి దుఖాణాల డిప్‌ప్రక్రియ కోనసాగించిన సందర్బంగా శ్రీశైలందేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎస్.లవన్న విలేఖర్లతో మాట్లడారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలుపరుస్తూ దేవస్థానంలోని దుఖాణాదారులకు లక్కిడిప్ ద్వారా దుఖాణాలను కేటాయించడం జరిగిందన్నారు. డిప్‌లో పాల్గొని దుఖాణాలు దక్కించుకున్న వారికి రేపటి దినం వారికి దుఖాణాల యొక్క తాళాలను అందజేయడం జరుగుతుందని వివరించారు. మిగత 39 దుఖాణాలకు సంబందించిన నివేదికను హైకోర్టుకు తెలియపరచడం జరుగుతుందన్నారు. ఈ నేపద్యాంలోనే తదుపరి కోర్టు ఇచ్చె తీర్పును దేవస్థానం అమలు పరచడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా దుఖాణాదారులందరికి ఈ నెల 15 వ తేది లోపు పాత దుఖాణాలను ఖాళీ చేసేందుకు గడువును ఇవ్వడం జరుగుతుందని పేర్కన్నారు. లక్కిడిప్‌లో పాల్గోనని దుఖాణాదారుల దుఖాణాలను కూడా తోలగించడం జరుగుతుందని చెప్పారు. తదుపరి క్షేత్రంలో రోడ్ల విస్తారణ, సుందరికరణ పనులను ప్రారంబించడం జరుగుతుందని పేర్కన్నారు. క్షేత్రం దినదినాబివృద్ధి చెందుతున్న నేపద్యాంలో భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకోని అబివృద్ది పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి సల్పండం జరుగుతుందని చెప్పారు. ఇందుకు క్షేత్రంలోని వ్యాపారస్థులందరు సహకరించాలని వారు కోరారు.

## ఫోక్ సింగర్ మంగ్లీకి జడ్‌పిటిసి పులికొండ నాయక్ ఘన సన్మానం



**తుగ్గలి, డిసెంబరు 3, ప్రభాతవార్త :** అనంతపురం జిల్లా గుత్తి మండలం బసినేపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పాపులర్ ఫోక్ సింగర్ మంగ్లీని జడ్‌పిటిసి పులికొండ నాయక్, వైసిపి మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌లు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆమెను శాలువా, పూలమాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగర్ మంగ్లీ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఫోక్ పాపులర్ సింగర్‌గా పేరు సంపాదించుకుని తనదైన స్టైల్‌లో సినిమాల్లో క్లాస్, మాస్ పాటలు పాడుతూ యువకులను ఊపేస్తుందని కొనియాడారు. మంగ్లీ కేవలం సినిమా పాటలు మాత్రమే కాకుండ ప్రైవేట్ ఆల్బమ్స్, భక్తి పాటలు, పొలిటికల్ పరంగా లీడర్స్‌ని ప్రమోట్ చేయడానికి అనేక పాటలు పాడి తనకంటూ చెరగని ముద్ర సంపాదించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి సభ్యుడు నారాయణ నాయక్, వెంకటేష్ నాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమిపూజ



**గడివేముల, డిశంబర్03, ప్రభాతవార్త ;** మండలంలోని కొరటమద్ది గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సాయంతో వెంకటేశ్వరస్వామి దేవాలయం శంకుస్థాపన కార్యక్రమం శనివారంనాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాణ్యం ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. వేద పండితులు మంత్రోచ్ఛరణ నడుమ ఆలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా చేపట్టారు. అర్చకులు, పండితులు భూమిపూజ, హోఆలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరు భక్తిభావాన్ని కలిగి ఉండాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ఆర్.బి. చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.బి.కె.చైర్మన్ పుల్లయ్య, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రఘుమాధవరెడ్డి, కొరటమద్ది గ్రామ సర్పంచ్ ఇడమకంటి నాగేశ్వరరెడ్డి, కంచుపాటి రామకృష్ణారెడ్డి, దేరెడ్డి అయ్యపురెడ్డి, దేరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఐసాని తిరుపమ్‌రెడ్డి, దుర్వేసి బండపల్లి రమేష్, చిందుకూరు కృష్ణారెడ్డి, గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే భూమా

**- సంఘ విద్యార్థులకు పాలు అందిస్తానన్న హామి**



**నంద్యాల, డిసెంబరు 3, ప్రభాతవార్తః** పేద విద్యార్థులు పడే కష్టాలను చూసి చలించిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి సంఘమిత్రలో చదివే విద్యార్థులకు నేటి నుంచి పాలు అందిస్తానని హామి ఇచ్చారు. పేద విద్యార్థులు పడే కష్టాలు చిన్నప్పటి నుంచి చూశానని సేవచేయాలనే తలంపుతో ఈకార్యక్రమం చేపట్టానని తెలిపారు. తండ్రి భూమా వీరశేఖర్‌రెడ్డిలాగే మాజీ ఎమె ్మల్యే భూమా బ్రహ్మానందరెడ్డికి సేవాగుణం లభించడం విశేషమని పేర్కొన్నారు. గతంలో దానకర్ణుడు ఎస్పీవైరెడ్డి సంఘమిత్ర విద్యార్థులకు పాలతో పాటు ఆర్థికంగా అదుకునేవారు ఆయన మృతితో సంఘమిత్రకు కష్టాలు మొదలయ్యాయి. ఈనేపథ్యంలోనే సంఘమిత్ర అధ్యక్షులు కర్నాటి నాగసుబ్బారెడ్డిని సంఘమిత్ర బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన భూమా ఇకపై సంఘ మిత్ర విద్యార్థులకు తనసొంత స్టార్‌డైరీ పాలకేంద్రం నుంచి పాలఅందిస్తానని పేర్కొన్నారు. మానవత్వంతో ముందుకురావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా భూమా మాట్లాడుతూ పదవులు, హోదా ఎంతడబ్బు ఉన్నా పేద విద్యార్థులకు సేవచేస్తే ఎంతో సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరు తమకు చేతనైన విధంగా పేదలను అదుకుంటే భగవంతుడు అన్నివిధాలుగా అదుకుంటారని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం : ఎమ్మెల్యే



**పత్తికొండ, డిసెంబరు 3, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి పేదప్రజలకు వరంలాంటిదని ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహం నందు ఎమ్మెల్యే శ్రీదేవమ్మ సిఎం సహాయనిధి చెక్కులను భాదితులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద అమలు కాని జబ్బులకు సిఎం సహాయనిధి తోడ్పాటు అందిస్తుందన్నారు. దరఖాస్తు చేసుకున్న భాదితులకు త్వరగా సహాయం అందిస్తామన్నారు. సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న మొలగవల్లి షేక్షావలి రూ.22వేలు, తెలుగు హరి రూ.4లక్షల30వేలు, వడ్డే కాశన్న రూ.42వేలు, షేక్ హజారంజి రూ.50వేలు, రాఘవరెడ్డి రూ.1లక్ష, కమ్మర శ్రీరామలాచారి రూ.60వేలు చెక్కులను అందచేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా భాదితులు సిఎం జగన్, ఎమ్మెల్యే శ్రీదేవమ్మలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నాగరత్నమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, వైసిపి జిల్లా నాయకులు కారం నాగరాజు తదితరులున్నారు.

## ఎంపీకి విన్నవించిన కమతం వెంకటేష్



**ఆదోనిలీగల్, డిశంబర్03, ప్రభాతవార్త ;** సునయన ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమానికి ఎంపీ సంజీవకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మ దివ్యాంగుల సంక్షేమ సంఘం (ఆశ్రమం) కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఈరన్న ఆదోని డివిజన్ అధ్యక్షుడు కమతం వెంకటేష్ ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఆయన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీకి అందించారు. ఎంపీ మాట్లాడుతూ దివ్యాంగుల ఆశ్రమాన్ని కూల్చిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, అలాగే మీ సమస్యని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అన్నివిధాలా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కార్యదర్శి లక్ష్మణస్వామి, నంద్యాల సుధాకర్, బీసీ నాగరాజు, అభిలాష కుర్ర మధుబాబు, బోయ రామాంజనేయులు పాల్గొన్నారు.